ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జనగామ

శుక్రవారం 22 మార్చి 2024





రంజాన్ వేళలు


ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.33 గం.

సహర్ : శనివారం ఉ : 4.56 గం.

బడుల బాధ్యత అమ్మలకే!



జనగామ మండలం గానుగుపహాడ్ పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులు



- మహిళా సంఘాలకు అప్పగించిన సర్కారు
- ఎస్ఎంసీల స్థానంలో ఇక అమ్మ ఆదర్శ కమిటీలు
- చైర్‌పర్సన్‌లుగా గ్రామైక్య సంఘాల వీవోలు
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో రూ.17.88 కోట్లతో పనులకు అనుమతులు
- కొనసాగుతున్న కమిటీల ఏర్పాటు ప్రక్రియ
- జిల్లాలో మొత్తం 508 పాఠశాలలు

జఫర్‌గడ్, మార్చి 21: సర్కారు యాజమాన్య పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి అవసరమైన పనులను చేపట్టే బాధ్యతలను వీరికి అప్పగించేందుకు నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో నిర్వహణ బాధ్యతలను ఇక నుంచి మహిళా స్వయం సహాయక సంఘాలు చేపట్టనున్నాయి. ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) స్థానంలో ఇక అమ్మ ఆదర్శ కమిటీలు కొలువుదీరనున్నాయి. జిల్లాలో మొత్తం 508 స్థానిక, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

పాఠశాల పేరుతో కొత్త ఖాతా...

పాఠశాల పేరుతో గతంలో ఎస్ఎంసీ ఖాతా ఉండేది. ఇపుడు అమ్మ ఆదర్శ కమిటీల ఎంపికతో పాఠశాల చైర్‌పర్సన్, కన్వీనర్ పేరుతో మరో ఖాతాను తెరవాలని విద్యాశాఖ అధికారులు సూచించడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చైర్‌పర్సన్‌లతో కలిసి కొత్త ఖాతాలను తెరుస్తున్నారు. ఇందులో ఇద్దరికి చెక్‌పవర్ ఉంటుంది.

కమిటీల నిర్మాణం..

ఆయా గ్రామ /పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు (వీవో) అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి చైర్‌పర్సన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థుల తల్లుల్లో .. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున కమిటీలకు సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరు మహిళా స్వయం సహాయక సభ్యులై ఉండాలి. ఈ ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ అయి ఉండాలి. అయితే గ్రామంలో ఒకే వీవో ఉండి పాఠశాలలు ఎక్కువగా ఉన్న చోట ఆ వీవో అన్ని పాఠశాలలకు చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఎక్కువ సంఖ్యలో వీవోలు ఉంటే రొటేషన్ పద్ధతిలో ఆయా పాఠశాలలకు చైర్‌పర్సన్‌గా ఉంటారు.

కమిటీల విధులు, బాధ్యతలు...

ఈ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు విద్య, పాఠశాలల నిర్వహణలో పాలు పంచుకోనున్నాయి. పాఠశాలల పర్యవేక్షణ, బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, బడుల మరమ్మతులు, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణం, పాతవి పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుదీకరణ, పారిశుధ్య నిర్వహణ, సోలార్ పానెళ్ల ఏర్పాటు, విద్యార్థుల యూనిఫాం తయారీ తదితర అంశాలు ఈ కమిటీలు చేపట్టాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాశాలల నిర్వహణను పర్యవేక్షిస్తుంటారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు పర్యవేక్షణతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూస్తారు.

రూ.25 వేల వరకు టెండర్లు లేకుండా పనులు...

పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో రూ.25 వేల వరకు అయ్యే పనులకు టెండర్లు లేకుండా చేస్తారు. అంతకుమించిన పనులు ఉంటే టెక్నికల్ కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా పాలనాధికారులకు నివేదిస్తాయి.. ఏఈ, డీఈ పనుల రికార్డులను ఎంబీలో నమోదు చేస్తారు. రూ.లక్ష దాటితే కలెక్టర్ల పర్యవేక్షణలో చెల్లిస్తారు. పనులు పూర్తయ్యాయని ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన తరువాతే బిల్లులు చెల్లిస్తారు.

పనులకు ఉపాధి, ప్రత్యేకాభివృద్ధి నిధులు..

ఆయా పాఠశాలల్లో చేపట్టే పనుల కోసం ఉపాధి హామీ పథకం, ప్రత్యేకాభివృద్ధి నిధులతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు ఇచ్చే వాటిని ఖర్చు చేయాలని నిర్ణయించారు. నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఆయా పనుల విలువలో మూడు శాతం నిధులను సర్వీస్ చార్జీల కింద కమిటీలకు జిల్లా పాలనాధికారులు చెల్లిస్తారు. కాగా, జిల్లాలోని 12 మండలాల పరిధిలో 508 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో గుర్తించిన పనుల వ్యయంపై ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీలు బడ్జెట్ నిధుల అంచనాలను రూపొందిస్తాయి. ఆయా మండలాలు, పాఠశాలల్లో చేపట్టే పనులు, నిధుల కేటాయింపు, పర్యవేక్షించే శాఖలు.. వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే గుర్తించిన పాఠశాలల్లో అత్యవసర పనులను జూన్ 10 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

మౌలిక వసతుల కల్పనకు దోహదం..

- కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం చేకూరనుంది. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడుతుంది. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. బడులు సక్రమంగా పని చేసేందుకు కమిటీలు దోహదపడతాయి. కమిటీల ఎన్నిక ప్రక్రియ, విధానం, చైర్‌పర్సన్‌ల ఎంపికపై ఆయా మండలాల నోడల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇచ్చాం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పకడ్బందీగా కమిటీల ఏర్పాటు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ఎంపిక ప్రక్రియ పూర్తి కావస్తోంది.

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా



నర్మెట ఎంపీడీవో కార్యాలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్మెట, మార్చి 21 : ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా సూచించారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల గురించి ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఈజీఎస్ పెండింగ్ పనులను గడువు లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ లెవల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈజీఎస్, శానిటేషన్ పనులపై యాక్షన్ ప్లాన్‌లను త్వరగా రూపొందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై ఆరా తీశారు. ఐకేపీ ద్వారా విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లను కుట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల సౌకర్యార్థ కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఖాజా మొహినొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

తెరపైకి రోజుకో పేరు..

- కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఆశావహుల్లో ఉత్కంఠ
- వరంగల్ టికెట్‌పై కుదరని ఏకాభిప్రాయం
- తలో పేరుతో అధిష్ఠానంపై మంత్రుల ఒత్తిడి
- ఏఐసీసీ సీఈసీలో వరంగల్ సీటుపైనే ప్రధాన చర్చ
- ఎంపీ దయాకర్‌తో పాటు ఇందిర, సాంబయ్య, పరంజ్యోతిల్లో అవకాశమెవరికో?
- తాజా జాబితాలోనూ రాని స్పష్టత

వివరాలు 8వ పేజీలో...

ముగిసిన 'బార్' నామినేషన్ల పరిశీలన

- ఏకగ్రీవంగా పలువురి ఎన్నిక

జనగామ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జనగామ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన గురువారం పూర్తయింది. అధ్యక్ష, ఉపాధ్య, ప్రధాన కార్యదర్శి మినహా పలు పదవులకు పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీ పదవికి మన్నె సత్తయ్య, కోశాధికారిగా సీహెచ్.చంద్రశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.మురళి, కార్యవర్గసభ్యులుగా ఈ.జ్యోత్స్న, కె.దాసు, ఈ.ఉదయ్, జె.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి డి.హరిప్రసాద్ యాదవ్, వై.చంద్రరుషి, ఉపాధ్యక్ష పదవికి కె.రాంరెడ్డి, ఎస్.బి కిషన్, ప్రధాన కార్యదర్శి పదవికి టి.రాజయ్య, ఎన్.సిద్ధులు, ఎస్.రేణుక బరిలో ఉన్నారు. ఎన్నికల అధికారిగా శ్రీరామ్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా ఆకుల శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు 99.90% హాజరు

జనగామ కల్చరల్, మార్చి 21: టెన్త్ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం తృతీయ భాష ఇంగ్లీషు పరీక్ష నిర్వహించారు. 6698 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరు కాగా 6691 మందితో 99.90 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో కె.రాము తెలిపారు. పరీక్షల సందర్భంగా ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా సందర్శించారు. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ జనగామ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఫయింగ్ స్క్వాడ్ 14 పరీక్షా కేంద్రాలను, డీఈవో 7 కేంద్రాలను సందర్శించారు. డీఈవో వెంట ఏసీజీ రవికుమార్ ఉన్నారు.

త్వరలోనే ఘన్‌పూర్‌లో కోర్టు సేవలు

- జిల్లా జడ్జి రవీందర్‌శర్మ



భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జి రవీందర్‌శర్మ

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 21: స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా కోర్టు జడ్జి రవీందర్‌శర్మ తెలిపారు. ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేసిన ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆయన గురువారం పరిశీలించారు. కోర్టుభవనంలో ఉండాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కోర్టు ఏర్పాటుకు ఎలాంటి అటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ముస్క రాజును ఆదేశించారు. భవనం సుందరీకరణకు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు సరిపోవని, అదనంగా మరిన్ని నిధులు వచ్చేలా అధికారులు ప్రపోజల్స్ పంపించాలని సూచించారు. వెంటనే భవనం మరమ్మతులు చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తైతే 20 రోజుల్లో కోర్టు సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీందర్, ఏఈ రవీందర్ రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్లు బుస్స జనార్దన్, భైరపాక జయాకర్, స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్, ప్రధానకార్యదర్శి పిల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి తిరుకల్యాణం

వేడుకలకు ముస్తాబైన చిలుపూర్ ఆలయం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



చిలుపూర్ గుట్ట ఆలయం

చిలుపూర్, మార్చి 21: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుపూర్ గుట్ట శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. చిలుపూర్ గుట్టపై 14 వందల ఏళ్ల క్రితం కాకతీయుల నాటి కాలంలో నిర్మించిన అతి పురాతన దేవాలయాల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన ఈ దేవాలయంలో బుగులు వెంకటేశ్వర స్వామి నిత్య పూజలందుకుంటున్నారు.

స్థల పురాణం..

పూర్వకాలంలో వెంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవారితో వివాహం జరిగే సమయంలో కుబేరుని వద్ద తీసుకున్న అప్పు తీర్చలేక భయంతో ఇక్కడకు వచ్చి చిలుపూర్ కొండకు ఎగువన ఉన్న గుహలో తలదాచుకున్నాడని పూర్వీకులు చెబుతారు. పక్కనే ఉన్న కొలనులో మునులు స్నానాలు ఆచరించి స్వామివారికి నిత్యపూజలు చేసేవారని, కాలక్రమేణా ఓరుగల్లు పట్టణాన్ని పరిపాలిస్తున్న కాకతీయ రాజులకు ఇక్కడ స్వామివారు వెలసిన విషయం తెలియడంతో నాటి నుంచి నిత్యపూజలు చేసేవారని ప్రతీతి. ప్రభుత్వ సహకారంతో 1999లో ఆలయ పునఃనిర్మాణంతో పాటు, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అప్పటినుంచి పాంచరాత్ర, ఆగమశాస్త్ర, శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఇక్కడ నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.



బుగులు వేంకటేశ్వర స్వామి వారు

కోరిన వరాలిచ్చే కొంగు బంగారం

కోరినవరాలిచ్చే కొంగు బంగారం శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని పరిసర ప్రాంత ప్రజలు ఇలవేల్పుగా కొలుస్తారు. స్వామివారు పాదాలు మోపిన చోట 40 రోజులు అఖండదీపం వెలిగించడంతో పాటు, ఆలయం చుట్టూ 11 ప్రదక్షిణలు చేసిన భక్తులకు తమ కోరికలు తీరతాయని ప్రగాఢ విశ్వాసం.

ఏర్పాట్లు పూర్తి చేశాం..: లక్ష్మీప్రసన్న, ఈవో



వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుట్ట దిగువన కాలక్షేప మండప సమీపంలో స్థలాన్ని సిద్ధం చేసి ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, ఎండవేడిమిని తట్టుకునేందుకు వీలుగా చలువ పందిళ్లు వేశాం. విద్యుద్దీపాలు, ఎల్ఈడీ లైట్లు, సౌండ్ సిస్టం, కల్యాణ తంతును తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లతో పాటు, భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేక బస్సు సర్వీసులు నడిచే విధంగా చర్యలు చేపట్టాం. భక్తులు వేచి ఉండేందుకు వీలుగా కాలక్షేప మండపాన్ని సైతం సిద్ధం చేశాం. వేడులకు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది.

సెల్ టవర్ ఎక్కిన కాంగ్రెస్ కార్యకర్త

మండల అధ్యక్షుడిగా పెద్ది కృష్ణమూర్తినే కొనసాగించాలని డిమాండ్

లేదంటే దూకి చస్తానని బెదిరింపు

'పెద్ది' ఫోన్‌తో దిగివచ్చిన ఉప్పుల బాబు



సెల్‌టవర్ వద్ద రోదిస్తున్న బాబు తల్లి లక్ష్మి



సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న కృష్ణమూర్తి వర్గీయుడు ఉప్పుల బాబు

దేవరుప్పుల, మార్చి 21: మండల కేంద్రానికి చెందిన పెద్ది కృష్ణమూర్తిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షపదవినుంచి తొలగించినందుకు ఆయన వర్గీయుడు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. అదే గ్రామానికి చెందిన ఉప్పుల బాబు గురువారం కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. కృష్ణమూర్తి తొలగింపును రద్దు చేసుకోవాలని, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వచ్చి హామీ ఇస్తేనే దిగుతానని తేల్చి చెప్పాడు. లేదంటే దూకి చస్తానని బెదిరించాడు. సుమారు గంటపాటు సెల్‌టవర్‌పైనే కూర్చుని హెచ్చరికలు చేశాడు. ఎస్సై చెన్నకేశవులు వచ్చి వారిద్దరితో ఫోన్‌లో మాట్లాడిస్తానని ఎంత చెప్పినా వినలేదు. ఆయన తల్లి లక్ష్మి వచ్చి "దిగు కొడుకా" అని ఎంత రోదించినా పట్టించుకోలేదు. దీంతో సుమారు గంటపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కృష్ణమూర్తి కష్టపడి పార్టీని కాపాడుకుంటూ యశస్వినిరెడ్డిని గెలిపిస్తే, మూడునెలలు తిరుగక ముందే ఎలా తొలగించి ఆయన స్థానంలో నల్ల శ్రీరామ్‌ను నియమిస్తారని ప్రశ్నించాడు. చివరకు పెద్ది కృష్ణమూర్తి ఫోన్‌లో మాట్లాడి సర్దిచెప్పడంతో టవర్ దిగివచ్చాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అధిష్ఠానం ఆదేశాల మేరకే నడుచుకుంటా

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీ కోసం కృషి చేస్తా

నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరామ్

8

ఓటు వేసే విధంగా ఓటర్లను చైతన్యపరచాలి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి21: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరును ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ.. స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌వో వైవీ గణేష్, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21: వరంగల్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికిగాను కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు. www.tswreis.ac.in వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.



ఉప రాష్ట్రపతిని కలిసిన వద్దిరాజు రవిచంద్ర

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రవిచంద్ర

వరంగల్ సిటీ, మార్చి 21: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ శాసన సభ్యులు మీసేవలను గుర్తించి, మీ పట్ల విశ్వాసం ఉంచి తిరిగి రాజ్యసభకు పంపించారని ఈ సందర్భంగా జగదీప్ ధన్‌కర్ రవిచంద్రను అభినందించారు. అదేవిధంగా ఈ ప్రజాస్వామ్య(పార్లమెంట్) దేవాలయంలో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు మీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని రవిచంద్రతో అన్నారు. స్పందించిన రవిచంద్ర ధనకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య



ప్రశాంత్(ఫైల్)

ఐనవోలు, మార్చి 21: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బరిగెల ప్రశాంత్(24) మూడేళ్ల నుంచి కొంత మంది రైతుల వద్ద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేయగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన రూ.4లక్షల అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వేలాడుతున్న ఉరి నుంచి అతడిని తప్పించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కౌలు రైతుగా చేసిన అప్పులు తీర్చే దారి కనిపించక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అనుషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

మందులోళ్లు.. మాయలోళ్లు..

● అక్రమంగా ప్రభుత్వ మందుల విక్రయాలు ● కంటి ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న దందా



వరంగల్ మెడికల్, మార్చి 21: ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మాయలోళ్లు తయారయ్యారు. మందులు పంపిణీ చేసే ఉద్యోగులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఔషధాలను పేద రోగులకు ఇవ్వకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇదంతా ఏళ్ల తరబడి జరుగుతున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏకంగా అక్రమ మందుల విక్రయాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునేంతవరకు కూడా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆరోపణలు వచ్చినా అంతే..

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఫార్మసిస్టు నాగేందర్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో స్టోర్స్‌లో పనిచేసిన ఈయన.. మళ్లీ అదే ఆస్పత్రిలో ఓపీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా ఇదే ఆస్పత్రిలో తిష్ట వేయడంతోపాటు అన్ని విషయాలు అవపోసనపట్టి అక్రమంగా మందులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీఎంతోపాటు బోధనాస్పత్రుల్లో కూడా ఈ దందా కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మురికివాడల్లోని అర్బన్ సెంటర్లలో కూడా మందులు పక్కదారి పడుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

మార్కెట్‌లో శాంపిల్స్

వివిధ కంపెనీలు డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ ఔషధాలు కూడా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ఇవి డాక్టర్ ద్వారా రోగులకు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మెడికల్ షాపులు విక్రయాలకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా కొందరు లేబుళ్లను మార్చి నకిలీ మందులను కూడా తయారు చేస్తున్నట్లు కొంతకాలంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ డాక్టర్ చిట్టీ లేకుండానే అమ్ముతున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ తనిఖీల్లో అనేక పర్యాయాలు బయటపడింది. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కాజీపేట సమీపంలోని నిట్‌క్యాంపస్ ఏరియాలో నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు కొనసాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే..

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల గల్లీలో నిబంధనలకు విరుద్ధంగా అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే వెలిశాయి. మెడికల్ షాపుల్లో సైతం అద్దాలు విక్రయించడం కనిపిస్తుంటుంది. కంటి ఆస్పత్రి నాలుగో తరగతి ఉద్యోగులు ప్రయివేట్ అద్దాల షాపులతో కుమ్మక్కై రోగులను బయటకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా కంటి అద్దాలను విక్రయాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా ఈ దందా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం.

'బార్' బరిలో వీరే..

హనుమకొండ బార్ ఎన్నికల్లో పోటాపోటీ

వరంగల్ లీగల్, మార్చి 21: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగనున్న ఎన్నికల బరిలో 32 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధ్యక్షస్థానానికి ఎం.రమేష్‌బాబు, పి.సత్యనారాయణ పోటీ పడుతుండగా ఉపాధ్యక్ష పదవికి పి.రఘుపతి, ఎస్.రాజన్‌బాబు, పి.రవీందర్, ఎస్.యుగంధర్ బరిలో ఉన్నారు. అలాగే ప్రధానకార్యదర్శి పదవికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, ఎల్.రమేష్. బి.శంకర్, ఆర్.వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. మహిళా జాయింట్ సెక్రటరీ పదవికి వి.పద్మ, జె.స్వప్న, స్పోర్ట్స్ కల్చరల్ జాయింట్ సెక్రటరీ పదవికి పి.చిరంజీవి, ఎం.మహేష్ పటేల్. సి.మల్లేష్, కోశాధికారి పదవికి జి.సదానందం, పి.సమ్మిరెడ్డి, ఎ.శివశంకర్‌లు పోటీ పడుతున్నారు. కార్యవర్గ సభ్యులుగా డి.అచ్యుత్‌కుమార్, జి.అనిల్ లాలానాయక్, ఇ.చంద్రశేఖర్, సీహెచ్.నిఖిల్‌కుమార్, వి.రమేష్, కె.రుత్విక్, ఎ.సందీప్‌కుమార్, ఎన్.సుహాస్, డి.సునిల్‌కుమార్, మహిళా కార్యవర్గ సభ్యుల పదవికి జి.రమాదేవి, కె.ఉష పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఎన్.విజేందర్, లైబ్రరీ జాయింట్ సెక్రటరీ పదవికి బి.సంపత్, 30 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా జి.సురేందర్‌రెడ్డి, 20 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా టి.శ్రీనివాస్, 10 ఏళ్ల మహిళా న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

కాజీపేట, మార్చి 21 : చిరువ్యాపారుల గల్లా పెట్టెల్లోంచి నగదు చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు రోజుల క్రితం కాజీపేటలో నాగరాజు ఫ్రూట్ షాపులో ఓ వ్యక్తి ఫ్రూట్స్ కొనుగోలు చేసి అతడి దృష్టి మరల్చి గల్లా పెట్టెల్లోంచి రూ.1250 చోరీ చేశాడు, నాగరాజు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం కడిపికొండ బ్రిడ్జి వద్ద పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండగా అతడిని పట్టుకుని ఆరా తీయగా అతడి పేరు యాకుబ్ పాష అని వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఇతను కాజీపేట ఫ్రూట్ షాపులో నగదును, పలు షాపులలో చోరీలకు పాల్పడుతున్నానని ఒప్పుకున్నాడు. నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపారు. కేసును చేధించిన ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణులను ఏసీపీ తిరుమల్ రావు అభినందించారు.

సమర్థవంతంగా పనిచేస్తున్న సంఘాలు

నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ



మాట్లాడుతున్న కుమార్ సాహూ

కాళోజీ జంక్షన్, మార్చి 21: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 రైతు ఉత్పత్తి దారుల సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, సంఘాలు ఏర్పడిన మొదట్లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం చాలా సంఘాలు విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ అన్నారు. నాబార్డు వరంగల్ క్లస్టర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కందులను డైరెక్టుగా కాకుండా పప్పుగా మార్చడం ద్వారా రైతుకు రెట్టింపు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డీడీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సంతోష్, కార్తీక్, హర్షవర్ధన్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు రెడ్‌క్రాస్ చైర్మన్ శుభాకాంక్షలు



గవర్నర్‌కు బొకే అందజేస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సభ్యులు

కాళోజీ జంక్షన్, మార్చి 21: రాష్ట్ర నూతన గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్‌ను హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్ క్రాస్ కార్యక్రమాలపై జిల్లా చైర్మన్లు రాష్ట్ర పాలక వర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రెడ్ క్రాస్ సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. వేసవి కాలం దృష్ట్యా బ్లడ్ సెంటర్లలో రక్తం కొరత లేకుండా చూడాలని ఆయన సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్ష తప్పదు

రౌడీషీటర్లకు హనుమకొండ సీఐ సతీష్ హెచ్చరిక



రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్

హనుమకొండ టౌన్, మార్చి21 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినట్లయితే కఠినమైన శిక్షలు తప్పవని హనుమకొండ సీఐ వై.సతీష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడుంటున్నారు..? ఎవరెవరు ఏమి చేస్తున్నారు? అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో బైండోవర్ కాని వారిని తప్పనిసరిగా ఈసారి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎవరెవరిపై కేసులు నమోదయ్యాయని ఆరా తీశారు. అసాంఘిక చర్యలకు పాల్పడ్డట్లు ఫిర్యాదు అందితే ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్ హాజరుకాని వారికి త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో సీఐతోపాటు ఎస్సైలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

పోలీసు అధికారిపై పోక్సో కేసు?

రహస్యంగా పోలీసుల విచారణ

వరంగల్ క్రైం, మార్చి21: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం సీఐగా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు అధికారిక సమాచారం. 2022 సంవత్సరంలో కేయూలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సదరు అధికారికి స్టేషన్ పరిధిలో ఒక మహిళతో సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం. ఈ విషయంలో మహిళ భర్త పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఏఆర్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. అనంతరం సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు, అటునుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన సదరు అధికారి.. ఇంకా మహిళతోనే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై కన్నేసిన పోలీసు అధికారి.. అత్యాచారయత్నం చేసినట్లు తెలిసింది. మైనరైన తన కూతురుపై పోలీసు అధికారి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఇటీవల కేయూలో మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ చేసిన కేయూ పోలీసులు.. గురువారం సదరు అధికారిపై అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కేయూ పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా చెప్పేందుకు నిరాకరించారు. పోలీస్ అధికారి కావడంతో వివరాలు వెల్లడించలేదు. రహస్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

లారీ డ్రైవర్‌పై కానిస్టేబుళ్ల దౌర్జన్యం

● కేసముద్రంలో వారం కిందట ఘటన
● ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం స్టేషన్‌లో ఓ లారీ డ్రైవర్‌పై ఇద్దరు కానిస్టేబుళ్లు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ బట్టలు విప్పి డ్రాయర్‌పై లాగుతున్న ఫొటో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇసుకను రవాణా చేసిన ఒక లారీ డ్రైవర్‌పై కేసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అసభ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వంశీధర్‌ను వివరణ కోరగా, ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చామని, దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా విచారణ అనంతరం సదరు కానిస్టేబుళ్లను నేడోరేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

మానుకోటలో 'రజాకార్' సందడి

లక్ష్మీ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించిన చిత్ర యూనిట్



మహబూబాబాద్ లక్ష్మీ థియేటర్‌లో మాట్లాడుతున్న సినీ నటి అనసూయ

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 'రజాకార్' చిత్రం యూనిట్ సభ్యులు గురువారం సందడి చేశారు. సినిమా విజయవంతంగా ప్రదర్శిస్తున్న నేపథ్యం లో అందులోని నటీనటులు అనసూయ, రాజ్‌అర్జున్, గిరి, శివం, సత్యనారాయణ, రమణ, అంజిరెడ్డి, పూజ, సినీ దర్శకుడు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు, మానుకోట ప్రాంతవాసి బీమ్స్ సిసిరోలియో మానుకోటలో పర్యటించారు. రజాకార్ చిత్రం ప్రదర్శింపబడుతున్న లక్ష్మీ థియేటర్‌కు యూనిట్ సభ్యులు చేరుకోవడంతో ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి, ఘనస్వాగతం పలికారు. బాణ సంచాలు కాల్చుతూ, పూలుచల్లుకుంటూ ఆహ్వానించారు. యూనిట్ సభ్యులు కొద్దిసేపు ప్రేక్షకులతో కలసి సినిమాను వీక్షించారు. అక్కడకు వచ్చిన ప్రేక్షకులు, అభిమానులు నటీనటులు, సంగీత దర్శకుడితో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు.

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాలి

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సినీనటి అనసూయ అన్నారు. నాడు రజాకార్లు హైదరాబాద్ సంస్థానంలో ప్రజలను ఎంత ఇబ్బంది పెట్టారో రజాకార్ చిత్రంలో చూపించడం జరిగిందని, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతీఒక్కరు ఈ సినిమాను చూడాలని కోరారు. నాడు రజాకార్ల ఆగడాలను ఎదిరించిన యోధుల చరిత్రను మరువవద్దన్నారు. ఈ సినిమాతో తనకు మరింత గుర్తింపు వచ్చిందని, ఇందులో తనకు నటించే అవకాశం కల్పించిన దర్శకుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. మానుకోట ప్రాంతవాసి సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మంచి సంగీతాన్ని అందించారని చెప్పారు.

స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం

నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆగడాలను ఎదురించి పోరాడిన యోధుల చరిత్రను భావితరాలకు అందించేందుకు తీసిన చిత్రం రజాకార్ అని సినీ దర్శకుడు యాట సత్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న అందరికీ ఈ చరిత్ర తెలువాలన్నారు. నాడు పర్కాలలో తొలి జాతీయజెండా ఎగురవేత, వరంగల్ జిల్లాలోని ఖిలాలో బత్తిని మొగిలయ్య జెండాను ఎగురవేసిన చరిత్ర రజాకార్ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించామన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ గత చరిత్ర భావితరాలకు తెలియకుంటే మన చరిత్రను తెలియ జేయడానికి ఎవరూ ఉండరని చెప్పారు. రజాకార్ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీ థియేటర్ యాజమాని చాపల రంజిత్‌రెడ్డి, డాక్టర్ బానోత్ వీరన్న, డాక్టర్ పరికిపండ్ల అశోక్, స్థానిక సినీ నటులు రాజు, శ్రీను పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం మండలకేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రజాకార్ చిత్ర యూనిట్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో పేదల పక్షాన పోరాడి అమరులైన వీరులు చిరస్థాయిలో చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. అనంతరం రజాకార్ చిత్ర విశిష్టతను ప్రజలకు తెలియపర్చిన యూనిట్ సభ్యులు ప్రతీ ఒక్కరు ఈ సినిమాను చూడాలని విజ్ఞప్తి చేశారు. చిత్ర యూనిట్ సభ్యులకు కళాకారులు ఘన స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో సినీనటీ అనసూయ, దర్శకులు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో, బయ్యారం వీరన్న పాల్గొన్నారు.

గందరగోళంలో 'గృహజ్యోతి'



జీరో బిల్లు రాకపోవడంతో వినియోగదారుల్లో అయోమయం
తిరస్కరణకు గురైన దరఖాస్తులకు ఎన్నికల కోడ్ అడ్డంకి
తర్వాత జీరో బిల్లు ఇస్తామంటున్న విద్యుత్ అధికారులు

హనుమకొండ టౌన్, మార్చి 21: 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్నప్పటికీ జీరో బిల్లు రాకపోవడంతో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లు రాని వాళ్లు మరోసారి మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆయా కౌంటర్లలో ఎన్నికల్లో కోడ్ పేరిట దరఖాస్తులను స్వీకరించడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో హైరానా మొదలైంది. తెల్లరేషన్ కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకునే కుటుంబాలు జీరోబిల్లు రాకున్నా విద్యుత్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి చెప్పినప్పటికీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. విద్యుత్‌శాఖ అధికారులు సైతం ఎన్నికల తర్వాత మార్చి, ఏప్రిల్, మే నెలలకు కలిపి జీరో బిల్లు ఇస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెబుతున్నప్పటికీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది.

అవగాహన లోపం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు సమయంలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి.. ఏ పథకానికి ఏ వివరాలు నింపాలి.. అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం చెందారు. ఫలితంగా కొంతమంది లబ్ధిదారులు ఒకదాని బదులు ఇంకొకటి రాశారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకునే సమయంలో యుఎస్సీ నెంబర్‌కు బదులు ఎస్సీ నెంబర్ రాశారు. ఇంకొందరు సరిగ్గా రాసినప్పటికీ డాటా ఎంట్రీ చేసే సమయంలో అయిన తప్పిదాల కారణంగా జీరో బిల్లు రాలేదని తెలుస్తోంది. అయితే మరోసారైనా సరిగా దరఖాస్తు చేసుకుందామని మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ దరఖాస్తులు స్వీకరించపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

హనుమకొండ జిల్లాలో 1,02,56 మంది దరఖాస్తు చేసుకోగా, 98,864 మందికి మాత్రమే జీరోబిల్లు వచ్చింది. జనగామ జిల్లా నుంచి 78,655 మంది దరఖాస్తు చేసుకుంటే 77,822 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 90,026 మందికి 88,658 మంది మాత్రమే జీరోబిల్లు పొందారు. అదే విధంగా ములుగు, భూపాలపల్లి నుంచి 77,250 మంది దరఖాస్తు చేసుకుంటే 72,638 మంది జీరోబిల్లు పొందారు. వరంగల్ జిల్లా నుంచి 1,02,836 మంది దరఖాస్తు చేసుకుంటే 99,426 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు.

రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం

ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



కాజీపేటలోని మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట, మార్చి 21: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంటనష్టంపై అంచనావేయాలని అధికారులను ఆదేశించారని స్టేట్ కో- ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మీడియా పాయింట్‌లో జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ కోసం 12 వందల మంది ఉద్యమకారులు ప్రాణాల త్యాగాలు చేస్తే భోగాలు అనుభవించి, విపరీతమైన ఆస్తులు సంపాదించింది మాత్రం కల్వకుంట్ల కుటుంబమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవ చేశారు. రైతుల కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు.

రైతు అభివృద్ధిపై ఎర్రబెల్లి దయాకర్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దయాకర్‌రావు ఓ పెద్ద దొంగ అని, ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీజేపీ సైతం రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోసం బీజేపీ డ్రామాలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుంచు చంద్రయ్య, తొట్ల రాజు యాదవ్, బోయిని కుమార్, గర్రం కోటేశ్వర్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేశ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ కల్చరల్, మార్చి 21: ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నివేదికలను రోజు వారీగా అందజేయాలని డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షించారు. ప్రతీ నియోజకవర్గానికి 3 ఫ్లయింగ్ సర్వేలెన్స్, 3 స్టాటిస్టికల్ సర్వేలెన్స్, 3 వీడియో సర్వేలెన్స్ చొప్పున 3 నియోజకవర్గాలకు 27 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కాల్ సెంటర్ నిరంతరాయంగా పని చేయాలని, నమోదైన కాల్స్ వివరాలు తెలియజేయాలని అన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా నమోదైన ఫిర్యాదుల వివరాల నివేదిక అందించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, ఓటు హక్కు విశిష్టత తెలియపర్చాలని అన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో అనిల్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్, ఈడీఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారుల పాత్ర కీలకం: ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న అన్నారు. గురువారం తన కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ నోడల్ అధికారులతో ఎన్నికల విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోడల్ అధికారులు నిర్లక్ష్యం చేయరాదని, విధులను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో క్రాంతి, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్న ఆలయంలో ఎదుర్కోళ్లు



ఆలయంలో ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహిస్తున్న పూజారులు

చిలుపూర్, మార్చి 21 : బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో గురువారం నిత్యనిధి హోమాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. అనంతరం ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, కృష్ణమాచార్యులు, రంగాచార్యుల వేదమంత్రాల నడుమ హోమం కాల్చారు. అనంతరం ఎదుర్కోళ్ల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ యాదవరెడ్డి, ఈవో లక్ష్మిప్రసన్న మాట్లాడుతూ నేడు (శుక్రవారం) నిర్వహించే స్వామివారి తిరుకల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు దంపతులు, ధర్మకర్తలు సంగోజు మోహనాచారి, మూల నాగరాజు దంపతులతో పాటు గట్టు ఎల్లయ్య, జక్కుల రాజశేఖర్, గాజుల రజని, గణేశ్, పుల్యాల నారాయణరెడ్డి, మేకల మల్లేషం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో పూజలు..



పూజలు చేస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయాన్ని జడ్పీ సీఈవో కె.అనిల్‌కుమార్ గురువారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ఇంటి ఇలవేల్పు వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మరచిపోలేని అనుభూతి అన్నారు. ఆయన వెంట ఎంపీవో శ్రీపాద మధుసూధన్, ఈజీఎస్ ఏపీవో మోహన్ రావు, పంచాయతీ సెక్రటరీ ఎమ్డీ అజీజ్‌పాషా తదితరులు ఉన్నారు.

అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటా

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్



నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

దేవరుప్పుల, మార్చి 21: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలమేరకు తాను నడుచుకుంటానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై షాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32గ్రామ కమిటీల అధ్యక్షుల్లో 28గ్రామాల అధ్యక్షులు తనను సూచించారని, వారి సూచన మేరకే నన్ను అధ్యక్షుడిగా కొనసాగాలని పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి నియమించారని అన్నారు. అందరినీ కలుపుకుని పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన దానికంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కువ మెజారిటీ సాధించేలా కృషి చేస్తానన్నారను. కృష్ణమూర్తి పార్టీ పట్ల, శ్రేణుల పట్ల, కార్యకర్తల పట్ల వ్యవహరించిన తీరు ఆయన తొలగింపునకు కారణమైందన్నారు. ఆయనతో పాటు వర్గీయులు కూడా పార్టీ వెంట నడవాలని కోరారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా అందరినీ కలుపుకుపోతానన్నారు. అంతే కాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి తలుపులు తీసి ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారెడ్డి, సురేష్ బాబు, కాడబోయిన గణేష్, సురంజన్‌రెడ్డి, రసూల్‌పాషా, ఓడపెల్లి రవీందర్, యాకన్న, ఇన్మల నాగరాజు, మహేందర్, తోటకూరి పాండు కృష్ణ, రమేష్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్

జిల్లా వైద్యశాఖ సమీక్షలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

జనగామ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల శాతాన్ని పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జాతీయ సార్వత్రిక ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, మతాశిశు సేవలు, అసంక్రమిత వ్యాధులు వంటి కార్యక్రమాల స్థితి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతాశిశు సంరక్షణ విషయంలో జిల్లా ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాల్సి ఉందన్నారు. జిల్లాలోని ప్రతీ పీహెచ్‌సీలో ప్రసవాలు చేసే స్థాయికి చేరుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచడంతో పాటు సీ-సెక్షన్ ప్రసవాల సంఖ్యను తగ్గించాలన్నారు. ప్రతీ పీహెచ్‌సీలో వచ్చే నెల నుంచి కనీసం ఒక్క డెలవరీ అయినా చేయాలని సూచించారు. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి అందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం(ఎన్సీడీ)లో భాగంగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్ కేసులను వందశాతం స్ర్కీనింగ్ చేసి ఫాలోఅప్ చేయాలన్నారు. జిల్లాలో డెంగీ, మలేరియా జ్వరాలను నియంత్రించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని, వాటిపట్ల ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని అన్నారు. వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకొని శుక్రవారం నుంచి ఈనెల 27 వరకు జిల్లాలోని ప్రజలకు నీటి నిర్వహణ, సంరక్షణ, నీటి కాలుష్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు మహేందర్, రవీందర్, శ్రీదేవి, సుధీర్, కరుణాకర్‌రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'



లింగాలఘణపురంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

లింగాలఘణపురం, మార్చి21: గర్భిణీలు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం దోహదపడుతుందని డీడబ్ల్యువో జయంతి అన్నారు. గురువారం బండ్లగూడెం రైతువేదికలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలతో పాటుగా కిశోరబాలిలు తీసుకోవాలని సూచించారు. దాంతో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టొచ్చని సూచించారు. చిన్నారులకు ప్రీస్కూల్ కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రంలోనే నిర్వహించాలని, ఎత్తుకు తగిన బరువును పరిశీలించాలని సూచించారు. ఎంపీడీవో జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో విక్టోరియా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రాజు, ఎంపీవో మల్లికార్జున్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సావిత్రి, హంసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తిమ్మంపేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం జయప్రకాశ్, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్, మార్చి 21 : సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని తిమ్మంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనగామలో జరిగిన జిల్లా స్థాయి బాలుర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో తిమ్మంపేట హైస్కూల్‌కు చెందిన మంద జశ్వంత్, లాకావత్ చరణ్, మల్లం రోహిత్, ఆడెపు కమల్, మారపాక వివేక్, వంగ మనోజ్, సిరికొండ హరీష్ (9వ తరగతి), మునిగాల శశిధర్ (8వ తరగతి), లాకావత్ అఖీల్ (7వ తరగతి), భూక్య మహేశ్ (6వ తరగతి) విద్యార్థులు పాల్గొని విశేష క్రీడా ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మంగు జయప్రకాశ్, పీఈటీ కొండ రవి తెలిపారు. వీరు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులను గురువారం జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంద మల్లేశ్, పాఠశాల శాశ్వత క్రీడా దాత చాడ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. మరింత పట్టుదల, క్రీడా నైపుణ్యంతో జాతీయ స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.



ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలు

గురుకులంలో ఫుడ్ పాయిజన్

ఐదుగురికి అస్వస్థత, ఎంసీహెచ్‌లో చికిత్స

జనగామ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్ కారణంగా ఐదుగురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన జనగామ శివారు పెంబర్తి బైపాస్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం రాత్రి జరిగింది. బాధిత బాలికలు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెటకు చెందిన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల జనగామ శివారు పెంబర్తి బైపాస్ వద్ద కొంతకాలంగా కొనసాగుతోంది. ఇందులో 5 నుంచి ఇంటర్ వరకు సుమారు 600 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. కాగా.. రోజువారీ మాదిరిగానే పాఠశాల సిబ్బంది సాయంత్రం 6 గంటలకు విద్యార్థినులకు భోజనం వడ్డించారు. మెనూ ప్రకారం వంకాయ కూర, సాంబారు, పెరుగుతో వడ్డించారు. భోజనం చేసిన తర్వాత 7.30 గంటల సమయంలో 9వ తరగతికి చెందిన ఎ.పావని, కె.ప్రతిభ, జి.అక్షిత, 8వ తరగతికి చెందిన జి.కార్తీక, డి.జ్యోత్స్నకు కడుపు నొప్పితో పాటు వాంతులు ప్రారంభమయ్యాయి. మొదటగా ఇద్దరు విద్యార్థినులకు వాంతులు కాగా ఆ తర్వాత మరో ముగ్గురికి తీవ్రమైన కడుపునొప్పితో వాంతులు అయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అప్రమత్తమై అంబులెన్స్ ద్వారా మొదటగా ఇద్దరు బాలికలను జనగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి చంపక్‌హిల్స్‌లోని మాతాశిశు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మరో ముగ్గురు బాలికలకూ వాంతులు కావడంతో వారిని కూడా ఎంసీహెచ్‌కు తరలించారు. ఐదుగురు బాలికలకు ఎంసీహెచ్ డ్యూటీ డాక్టర్ దివ్య చికిత్స అందించారు. ఫుడ్ పాయిజన్ కారణంగా వాంతులు అయి ఉండొచ్చని ప్రస్తుతం అందరి పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ దివ్య తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

రఘునాథపల్లి, మార్చి 21: ఆర్థిక ఇబ్బందులతో కొత్తూరి కార్తీక్ (28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన కార్తీక్ మూడు సంవత్సరాల క్రితం శ్యామల అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న క్రమంలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడని స్థానికులు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు రెండేళ్ల కూతురు ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, మార్చి 21: మండలంలోని వెల్ది గ్రామంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఆర్టిజన్ కార్మికుడు బర్మ రవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పరామర్శించారు. అంతకు ముందు రవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రవి కుటుంబ సభ్యులను విద్యుత్ అధికారులతో పాటు ఉద్యోగుల సంఘం నాయకులు పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.20 వేలు అందజేశారు. ఎస్పీడీసీఎల్ అధికారులు ఎం.లక్ష్మినారయణరెడ్డి, మనోహర్‌రెడ్డి, నీలం ఐలేష్, వీరాంజనేయులు, వేణుగోపాల్, రాహుల్, రవిందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తెరపైకి రోజుకో పేరు

వరంగల్ టికెట్‌పై కాంగ్రెస్‌లో కుదరని ఏకాభిప్రాయం

వరంగల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిత్వంపై రోజుకోపేరు తెరపైకి వస్తోంది. దీంతో అటు ఆశావహులతో పాటు.. ఇటు కేడర్‌లోనూ గందరగోళం ఏర్పడుతోంది. అయితే మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటంతోనే ఇదంతా జరుగుతోందని, ఏఐసీసీ కూడా ఆచితూచి అడుగులు వేస్తోందన్న చర్చ జరుగుతోంది. నిన్నటి వరకు దొమ్మాటి సాంబయ్యకే టికెట్ ఖరారైందన్న ప్రచారం జరగ్గా.. అనూహ్యంగా సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ పేరు తెరపైకి రావటం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ టికెట్ కోసం ఈ నియోజకవర్గం నుంచి 50మందికి పైగా క్యూ కట్టినప్పటికి అన్ని వడపోతల తరువాత నలుగురు పేర్లపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. గురువారం సాయంత్రం కాంగ్రెస్ జాబితా విడుదలగా.. రాష్ట్రంలో గతంలో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం.. తాజాగా మరో ఐదుగురికి అవకాశం ఇచ్చింది. కానీ అందులో వరంగల్ అభ్యర్థి ఎవరనేది స్పష్టత రాలేదు. ఇక హోలీపండుగ తర్వాతే వరంగల్ అభ్యర్థిత్వం ఎవరనేది తేలుతుందని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు సవాల్‌గా వరంగల్ అభ్యర్థి ఎంపిక..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన వరంగల్ స్థానంపై కాంగ్రెస్‌లోని ఆశావాహులు భారీ ఆశలు పెట్టుకున్నారు. టికెట్ కోసం గత నెల దరఖాస్తులు స్వీకరించగా, అత్యధికంగా 42మందికిపైగా టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన ఏఐసీసీ స్ర్కీనింగ్ కమిటీ మూడు పేర్లతో జాబితా తయారు చేసి ఏఐసీసీకి నివేదిక పంపించింది. ఈ జాబితాలో గత ఎన్నికల్లో ఎంపీగా పోటీచేసి ఓటమిపాలైన దొమ్మాటి సాంబయ్యతో పాటు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరా, నమిండ్ల శ్రీనివాస్ పేర్లు ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ టికెట్‌ను దొమ్మాటి సాంబయ్యకే ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారని, మొదటి జాబితాలో సాంబయ్య పేరు ఖరారవుతుందనే చర్చ జరిగింది. అయితే అనూహ్యంగా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు మరో ఇద్దరిముగ్గురు పేర్లను సూచిస్తూ ఏఐసీసీ అగ్రనేతలకు లేఖలు ఫ్యాక్స్ చేశారు. దీంతో అధిష్ఠానం తొలి జాబితాలో వరంగల్ ఎంపీ టికెట్ ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్‌లో చేరటంతో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఏర్పడింది.

వరంగల్‌పై ఎడతెరగని ఉత్కంఠ

అభ్యర్థిత్వం కోసం అనేక మంది ఆశావాహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉండగా.. రాష్ట్ర మంత్రులతో పాటు ఏఐసీసీ అగ్రనేతలు కూడా తమ అనుచరులకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో వరంగల్ టికెట్‌పై ఎడతెగని ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి తనతోపాటు కాంగ్రెస్‌లో చేరిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారని, కానీ వరంగల్‌కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు తలో పేరు సూచిస్తున్నారని సమాచారం. ఇక మొదటి నుంచి కాంగ్రెస్ టికెట్‌ను జన్ను పరంజ్యోతికి ఇప్పించేందుకు మంత్రి కొండా సురేఖ ప్రయత్నించినట్టు ప్రచారం జరిగింది. అలాగే మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తదితరులు స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరకు మద్దతుగా నిలిచినట్లుగా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు కూడా తమకు అనుకూలమైన మరికొందరి పేర్లను సూచించినట్టు సమాచారం. కానీ ఇటీవల పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ తొలుత టికెట్ ఆశించటం లేదని ప్రకటించి.. ఆ తరువాత తన మార్కు రాజకీయాలతో పోటీకి సై అంటున్నారు. ఇక దయాకర్‌కు సీఎంతో సత్సంబధాలున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ కూడా ఆయన వైపు కొంత సానుకూలంగా ఉన్నారని, దీంతో దయాకర్ పేరు ఏఐసీసీ పరిశీలనలో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రాగమళ్ల పరమేశ్వర్, బొడ్డు సునీత కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆశావాహులు డిల్లీలోనే మకాం వేసి కాంగ్రెస్ అగ్రనేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వరంగల్ టికెట్‌కు తీవ్ర పోటీ ఉండటంతో ఏఐసీసీ నేతల ఆదేశాల మేరకు సోషల్ మీడియా టీమ్‌తో పాటు సునీల్ కనుగోలు నేతృత్వంలో పలుమార్లు వరంగల్ అభ్యర్థులపై ఫ్లాష్ సర్వేలు చేపట్టారు. సర్వే రిపోర్టులతో పాటు అభ్యర్థుల ఆర్థిక, అంగ బలంపై అధిష్ఠానం దృష్టి పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో పార్టీ గుర్తుతో పాటు అభ్యర్థి బలం, బలహీనతలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో వరంగల్ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోందన్న చర్చ జరుగుతోంది.

సస్పెన్స్‌కు తెరపడేది హోలీ తర్వాతేనా?

ఇప్పటికే వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య ఖరారవడంతో ఆమె ప్రచారం కూడా ప్రారంభించారు. ఇక బీజేపీ అభ్యర్థిగా ఇటీవల పార్టీలో చేరిన అరూరి రమేష్‌కే టికెట్ ఖాయమని ప్రచారం జరుగుతుండటంతో పాటు ఆయన కూడా పార్టీలోని కీలక నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. ఇక కాంగ్రెస్‌లో మాత్రమే అభ్యర్థి ఎంపిక సవాల్‌గా మారటంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, మంత్రి కొండా సురేఖ సూచించిన వారికే అధిష్ఠానం మొగ్గు చూపుతుందా? లేదంటే మంత్రులు, ఏఐసీసీ నేతలు సూచించిన అభ్యర్థి వైపు కాంగ్రెస్ మొగ్గు చూపుతుందా? సర్వేల ఆధారంగా గెలుపు అవకాశాలున్న అభ్యర్థిని నిలబెడతారా అన్న చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జరుగుతోంది. అయితే ఏకాభిప్రాయం కుదిరితే హోలీ పండుగ తర్వాతే మరో జాబితా ఉంటుందని, అందులో మిగిలిన అన్ని స్థానాలతో పాటు వరంగల్ అభ్యర్థి ప్రకటన కూడా ఉంటుందని భావిస్తున్నారు.

కేంద్ర పథకాలపై బీజేపీ నేతల ప్రచారం



జఫర్‌గఢ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

జఫర్‌గఢ్, మార్చి 21: బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గురువారం పార్టీ నేతలు జఫర్‌గఢ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, సింగారపు రమేశ్ మాట్లాడుతూ కిసాన్ సమృద్ధి యోజన, ఉజ్వల గ్యాస్, సుకన్య యోజన వంటి అనేక పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల పవన్ యాదవ్, మొట్టక ప్రేమ్‌కుమార్, కట్ట సురెందర్, కత్తి సందీప్ గౌడ్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గిరిజన సాధికారత..

తరిగొప్పుల: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గిరిజన తండాల్లో బీజేపీ నాయకులు ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ భువనగిరి పార్లమెంట్ గిరిజనమోర్చ ప్రభారి, గిరిజన అసెంబ్లీ ఇన్చార్జి భూక్య నరేష్ నాయక్, బానోతు రాంకోతి నాయక్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మల పేరిట గిరిజన యూనివర్సిటిని ఏర్పాటు చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానోతు లక్ష్మణ్ నాయక్, మండల ఉపాధ్యక్షుడు కొన్నె రాజు, నాయకులు ప్రవీణ్ నాయక్, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

పార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలి..

బచ్చన్నపేట: ఈ నెల 22న మండల కేంద్రంలో జరిగే బీజేపీ విస్తృత సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆపార్టీ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, మండల అధ్యక్షులు చిమ్ముల నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌తో పాటు పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

యాగశాల నిర్మాణానికి భూమిపూజ



యాగశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్మన్ పండుగ భద్రయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 21: తాటికొండ గ్రామంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయం ఆవరణలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న యాగశాల నిర్మాణానికి గురువారం ఆలయ చైర్మన్ పండుగ భద్రయ్య గ్రామస్థులతో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న యాగశాల శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన యాగలశాలను దాతలు, గ్రామస్థుల సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు గ్రామానికి చెందిన కనకదుర్గ ఆలయ భక్తమండలి సభ్యులు పండుగ రాజేశ్వర్ రూ.5,116, పండుగ బుచ్చయ్య రూ.5,116 విరాళం అందించారని అన్నారు. కార్యక్రమంలో ఆలయ వైస్‌చైర్మన్ ఎడమ కుమార్, మార్క శ్రీనివాస్, కొరుకొప్పుల మహేందర్‌గౌడ్, తాటికొండ సంపత్‌యాదవ్, పొన్న రఘు, రొయ్యల కనుకయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు. అదేవిధంగా తాటికొండ శివాలయంలో చైర్మన్ రత్నాకర్‌రెడ్డితో పాటు కమిటీ బాధ్యులు కొంతం శ్రీనివాస్, కుసుమ రవి, సత్యనారాయణ రెడ్డి, పానుగంటి భాస్కర్, వనమాల వేద తదితరులు పూజలు చేశారు.

బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

నిరసన తెలిపిన మండేలగూడెం గ్రామస్థులు

రఘునాథపల్లి, మార్చి 21: మండలంలోని మండేలగూడెం నుంచి పోతరాజుతండా వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని మండేలగూడెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, కంకర పోసి వదిలి వేయడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని మాజీ ఉప సర్పంచ్ పుప్పాల వేణుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గాదె సిద్దేశ్వర్, తోట నరేష్, పొన్నాల అంజనేయులు, మెతుకు సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇసుక రవాణా చేస్తున్న వాహనాల సీజ్

లింగాలఘణపురం, మార్చి 21: మండలంలోని నెల్లుట్ల వాగుతో పాటుగా నేలపోగుల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై కుందారం క్రాస్‌రోడ్ వద్ద పోలీసులు బాబు, రాజేశ్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నెల్లుట్ల వాగునుంచి ట్రాక్టర్ ట్రాలీలో, కుందారం క్రాస్‌రోడ్ వద్ద ట్రాలీ ఆటోలో ఇసుకను తరలిస్తున్న సిద్ధిశేఖర్, వెంకటిరాజేశ్ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

పంటలకు పరిహారం ఇవ్వాలి

బీజేపీ నాయకుల వినతి

పాలకుర్తి, మార్చి 21: సాగునీరు ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు గురువారం నాయబ్ తహసీల్దార్ వేణుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ మాట్లాడుతూ వరి పంటలు ఎండిపోయి రైతులకు వేల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.20 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమ్మగాని శ్రీకాంత్, మారం రవికుమార్, రామరావు, వెంకన్న, పెనుగొండ సోమేశ్వర్, పెంతల మహేందర్, పబ్బా సంతోష్, రాణా ప్రతాప్, నగేష్ తదితరులు ఉన్నారు.